

**నేటి మ్యాచ్**
న్యూజిలాండ్ X అఫ్గానిస్థాన్
మ. 2.00 నుంచి
వేదిక: చెన్నై

## నేటి నుంచి రాష్ట్రస్థాయి యోగా పోటీలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో 10వ రాష్ట్రస్థాయి యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ప్రారంభం కానున్నాయి. జిల్లా యోగా సంఘం అధ్వర్యంలో రైస్ మిల్లర్స్ సంఘం, మానేరు విద్యాసంస్థల సౌజన్యంతో వీటిని నిర్వహిస్తున్నామని రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ రవీందర్ సింగ్ తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో 15 జిల్లాల నుంచి 700 మంది పాల్గొంటున్నారని.. 8 నుంచి 45 ఏండ్ల వయసు విభాగాల్లో రాణించినవాళ్లను గువాహటిలో నవంబర్ 23న జరిగే జాతీయ పోటీలకు పంపిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంత రెడ్డి, యోగా సంఘం కార్యదర్శి నాగిరెడ్డి సిద్దారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మోహ్నిష్‌కు పసిడి



హైదరాబాద్, ఆట ప్రతినిధి: డబ్ల్యూపీసీ జాతీయ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర లిఫ్టర్ మోహ్నిష్ పసిడి పతకంతో మెరిశాడు. బెంగళూరులో జరిగిన టోర్నీలో పురుషుల 82కిలోల కేటగిరీలో మోహ్నిష్ డెడ్‌లిఫ్ట్‌లో 220 కిలోల బరువెత్తి ప్రథమ స్థానంలో నిలిచాడు.

## సింధు శుభారంభం

న్యూఢిల్లీ: ఈ సీజన్‌లో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్న భారత స్టార్ షట్లర్ పీవీ సింధు.. డెన్మార్క్ ఓపెన్‌లో శుభారంభం చేసింది. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీలో సింధు, ఆకర్షి కశ్యప్ ప్రిక్వార్టర్స్‌కు చేరగా.. లక్ష్యసేన్, కిడాంబి శ్రీకాంత్ తొలి రౌండ్‌లోనే పరాజయాలు ఎదుర్కొని ఇంటిబాట పట్టారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో మంగళవారం సింధు 21-14, 18-21, 21-10తో క్రిస్టీ గిల్మోర్ (స్కాట్లాండ్)పై గెలిచింది.

# సఫారీలకు షాక్

## ప్రపంచ కప్‌లో నెదర్లాండ్స్ అతి పెద్ద సంచలనం



ఎడ్వర్డ్స్ (78*)

**వన్డే ప్రపంచకప్‌లో సంచలనాల పర్వం కొనసాగుతున్నది. అంచనాలు లేకుండా బరిలోకి దిగిన అఫ్గానిస్థాన్.. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌కు షాకిస్తే.. ఇప్పుడు దక్షిణాఫ్రికాపై అంతకుమించిన ఫలితంతో నెదర్లాండ్స్ ప్రపంచకప్‌ను కుదిపేసింది!**

**వరల్డ్‌కప్‌లో ఇప్పటి వరకు కేవలం రెండంటే రెండే మ్యాచ్‌లు నెగ్గిన ఓ చిన్న జట్టు.. ఇటీవలే మెగాటోర్నీలో అత్యధిక స్కోరు రికార్డు బద్దలు కొట్టిన టీమ్‌ను మట్టికరిపిస్తుందని ఊహించారా! హిమాలయ పర్వత సానువుల్లో డచ్ జట్టు దీన్ని చేసి చూపెట్టింది!!**

**అంచనాలకు అందకుండా సాగిన పోరులో దక్షిణాఫ్రికా పేస్ దాడిని తట్టుకుంటూ మంచి స్కోరు చేసిన నెదర్లాండ్స్.. ఆ తర్వాత అద్భుత బౌలింగ్‌తో సఫారీలకు చెక్ పెట్టింది. సప్త సముద్రాలు ఈదిన వాడు పిల్ల కాలువలో పడ్డట్లు.. సునాయాస లక్ష్య ఛేదనలో ప్రొటీస్ బ్యాటర్లు మూకుమ్మడిగా చేతులెత్తేశారు!!!**

ధర్మశాల: వన్డే ప్రపంచకప్‌లో అతిపెద్ద సంచలనం నమోదైంది. రెండు రోజుల క్రితమే ప్రపంచ చాంపియన్ ఇంగ్లండ్‌పై అఫ్గానిస్థాన్ విజయం సాధించగా.. మంగళవారం ధర్మశాలలో జరిగిన మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 38 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. గత రెండు మ్యాచ్‌ల్లో శ్రీలంక, ఆస్ట్రేలియాపై చక్కటి విజయాలతో సెమీఫైనల్ రేసులో ముందంజలో నిలిచిన దక్షిణాఫ్రికా.. చిన్న జట్టు చేతిలో ఓటమితో ఒక్కసారిగా చతికిలబడింది. వర్షం కారణంగా మ్యాచ్ నిర్ణీత సమయం కంటే ఆలస్యంగా ప్రారంభం కాగా.. ఆటను 43 ఓవర్లకు కుదించారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన నెదర్లాండ్స్.. నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 245 పరుగులు చేసింది. కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ (78 నాటౌట్; 10 ఫోర్లు, ఒక సిక్సర్) అదిరిపోయే హాఫ్‌సెంచరీ నమోదు చేయగా.. తొమ్మిదో, పదో స్థానాల్లో బరిలోకి దిగిన వాన్ డెర్ మెర్వ్ (29; 3 ఫోర్లు, ఒక సిక్సర్), ఆర్యాన్ దత్ (9 బంతుల్లో 23; నాటౌట్; 3 సిక్సర్లు) వజ్రాలకన్నా విలువైన పరుగులు రాబట్టారు. సఫారీ బౌలర్లలో ఎంగ్డీ, రబడ, జాన్సెన్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా 42.5 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌటైంది. డేవిడ్ మిల్లర్ (43; 4 ఫోర్లు, ఒక సిక్సర్), కేశవ్ మహరాజ్ (40; 5 ఫోర్లు, ఒక సిక్సర్) పోరాడినా ఫలితం లేకపోయింది. మార్క్‌రమ్ (1), డసెన్ (4), డికాక్ (20), బవుమా (16), క్లాసెన్ (28), జాన్సెన్ (9) ఒకరి వెంట ఒకరు పెవిలియన్ క్యూ కట్టారు. నెదర్లాండ్స్ బౌలర్లలో వాన్ బీక్ 3, వాన్ డెర్ మెర్వ్, బాస్ డీ లీడ్, మీకిరన్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. నిరుడు టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికాపై విజయం సాధించిన నెదర్లాండ్స్.. ఇప్పుడు వన్డే వరల్డ్‌కప్‌లోనూ సేమ్ సీన్ రిపీట్ చేసింది. ఎడ్వర్డ్స్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

## ఎడ్వర్డ్స్, ఆర్యాన్ మెరుపులు

**3** వన్డే ప్రపంచకప్‌లో నెదర్లాండ్స్‌కు ఇది మూడో విజయం. పెద్ద జట్ల పరంగా చూసుకుంటే ఇదే మొదటిది.

**2** మెగాటోర్నీలో దక్షిణాఫ్రికాను ఓడించడం నెదర్లాండ్స్‌కు ఇది రెండోసారి. నిరుడు టీ20 ప్రపంచకప్‌లోనూ డచ్ జట్టు సఫారీలను మట్టికరిపించింది.

### సంక్షిప్త స్కోర్లు

నెదర్లాండ్స్: 43 ఓవర్లలో 245/8 (ఎడ్వర్డ్స్ 78 నాటౌట్; వాన్ డెర్ మెర్వ్ 29; జాన్సన్ 2/27, రబడ 2/56), **దక్షిణాఫ్రికా:** 42.5 ఓవర్లలో 207 ఆలౌట్ (మిల్లర్ 43, కేశవ్ 40; వాన్ బీక్ 3/60, వాన్ డెర్ మెర్వ్ 2/34).

### ప్రపంచ కప్ పాయింట్ల పట్టిక

| దే | ఆ | గె | ఓ | ర.రే. | పా |
|---|---|---|---|---|---|
| భారత్ | 3 | 3 | 0 | +1.82 | 6 |
| న్యూజిలాండ్ | 3 | 3 | 0 | +1.60 | 6 |
| దక్షిణాఫ్రికా | 3 | 2 | 1 | +1.38 | 4 |
| పాకిస్థాన్ | 3 | 2 | 1 | -0.13 | 4 |
| ఇంగ్లండ్ | 3 | 1 | 2 | -0.08 | 2 |
| అఫ్గానిస్థాన్ | 3 | 1 | 2 | -0.65 | 2 |
| బంగ్లాదేశ్ | 3 | 1 | 2 | -0.69 | 2 |
| ఆస్ట్రేలియా | 3 | 1 | 2 | -0.73 | 2 |
| నెదర్లాండ్స్ | 3 | 1 | 2 | -0.99 | 2 |
| శ్రీలంక | 3 | 0 | 3 | -1.53 | 0 |

**నోట్:** దే: దేశం, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర: రన్‌రేట్, పా: పాయింట్స్



## కరీంనగర్‌లో ఆలిండియా చెస్ టోర్నీ

కొత్తపల్లి: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వైశ్య భవన్‌లో ఆలిండియా ఫిడే రేటింగ్ ఓపెన్ చెస్ టోర్నీ మంగళవారం ఘనంగా మొదలైంది. విశ్వనాథ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లాలో తొలిసారిగా జరుగుతున్న ఈ పోటీల్లో మనదేశంతో పాటు ఆస్ట్రేలియా, వివిధ రాష్ట్రాల నుంచి 260 మంది ప్లేయర్లు పాల్గొంటున్నారు. ఫిడే రేటింగ్ పద్ధతిలో ఈ వీటిని నిర్వహిస్తుండగా ప్రతీ ప్లేయర్ 9 రౌండ్లపాటు పోటీల్లో పాల్గొననున్నారు. రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ తొలి ఎత్తువేసి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, కన్నకృష్ణ, విశ్వనాథ్ పాల్గొన్నారు. చీఫ్ ఆర్బిటర్‌గా ఆర్ చంద్రమౌళి వ్యవహరిస్తున్నారు.



## సౌత్‌జోన్ అథ్లెటిక్స్ విజేత తెలంగాణ

హనుమకొండ చౌరస్తా: జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్‌ఎస్)లో జరిగిన 34వ సౌత్‌జోన్ జాతీయస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌ను తమిళనాడు దక్కించుకుంది. అండర్-14 బాలుర, బాలికల విభాగాల్లో తెలంగాణ మొదటి స్థానంలో నిలవగా అండర్-16, 18, 20 విభాగాల్లో తమిళనాడు నిలిచింది. జేఎన్‌ఎస్‌లో మూడు రోజులుగా జరిగిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ముగిశాయి. అండర్-14, 16, 18, 20 విభాగాల వారిగా పోటీలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 800 మంది అథ్లెట్లు ఇందులో పాల్గొనగా మొత్తం 140 ఈవెంట్లలో క్రీడా పోటీలు జరిగాయి. సౌత్‌జోన్ అథ్లెటిక్స్ జాతీయస్థాయి టోర్నీలో తెలంగాణ 16స్వర్ణాలు, 29 రజతాలు, 21 కాంస్యాలతో మూడో స్థానంలో నిలిచింది.


# తిలక్ తడాఖా

జైపూర్: కెప్టెన్ తిలక్ వర్మ (58 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) అజేయ అర్ధశతకంతో రాణించడంతో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో హైదరాబాద్ వరుసగా రెండో విజయం నమోదు చేసుకుంది. మంగళవారం హైదరాబాద్ 8 వికెట్ల తేడాతో జమ్ము కశ్మీర్‌ను చిత్తుచేసింది. మొదట జమ్ము కశ్మీర్ 8 వికెట్లకు 159 పరుగులు చేసింది. అనంతరం ఛేదనలో హైదరాబాద్ 18.3 ఓవర్లలో 2 వికెట్లకు 160 రన్స్ చేసింది. తిలక్‌తో పాటు రోహిత్ రాయుడు (38), రాహుల్ సింగ్ (35) రాణించారు.

**పంజాబ్ రికార్డు స్కోరు**

మరో మ్యాచ్‌లో పంజాబ్ రికార్డు స్కోరుతో ఆంధ్రప్రదేశ్‌పై విజయం సాధించింది. పంజాబ్ 6 వికెట్లకు 275 పరుగులు చేసింది. భారత దేశీయ టీ20ల్లో ఇదే అత్యధికం. అభిషేక్ శర్మ (51 బంతుల్లో 121; 9 ఫోర్లు, 9 సిక్సర్లు), అన్మోల్‌ప్రీత్ (26 బంతుల్లో 87; 6 ఫోర్లు, 9 సిక్సర్లు) దంచికొట్టారు. అనంతరం ఆంధ్ర 20 ఓవర్లలో 170/7కే పరిమితమైంది. రికీ భూయ్ (52 బంతుల్లో 104 నాటౌట్; 6 ఫోర్లు, 9 సిక్సర్లు) సెంచరీ వృథా అయింది. మరో మ్యాచ్‌లో **అశుతోష్ శర్మ 11 బంతుల్లో హాఫ్‌సెంచరీ చేసి యువరాజ్ సింగ్ పేరిట ఉన్న ఫాస్టెస్ట్ ఫిఫ్టీ (12 బంతుల్లో) రికార్డు బ్రేక్ చేశాడు.**

## క్రికెట్ అభివృద్ధి మా ఎజెండా: ఆగమ్‌రావు



హైదరాబాద్, ఆట ప్రతినిధి: రాష్ట్రంలో క్రికెట్‌ను అభివృద్ధి చేయడమే ఏకైక ఎజెండాతో హెచ్‌సీఏ ఎన్నికల్లో బరిలోకి దిగుతున్నామని ఆగమ్‌రావు పేర్కొన్నారు. ప్యానెల్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్యానెల్ తరపున కార్యదర్శి అభ్యర్థిగా పోటీపడుతున్న కరీంనగర్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆగమ్‌రావు మిగిలిన సభ్యులతో మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సుదీర్ఘ హెచ్‌సీఏ చరిత్రలో ఇప్పటి వరకు జిల్లాల నుంచి ఒక్క వ్యక్తికి కూడా ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం రాలేదు. కరీంనగర్‌కు చెందిన నేను తొలిసారి ఎన్నికల బరిలోకి దిగుతున్నాను. హైదరాబాద్‌కు దీటుగా జిల్లాల్లోనూ క్రికెట్ అభివృద్ధి చేయాలన్నదే మా ప్యానెల్ లక్ష్యం. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కల్గిన ప్లేయర్లకు కొదువలేదు. వారిని వెలుగులోకి తీసుకురావాలంటే నిరంతరం క్రికెట్ టోర్నీలు నిర్వహించాలి' అని అన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు అనిల్‌కుమార్, దల్జీత్‌సింగ్, బసవరాజు, మహేంద్ర, వినోద్ పాల్గొన్నారు.

## సిక్కుల డెస్టినేషన్ వివాహాలపై నిషేధం

న్యూఢిల్లీ, అక్టోబర్ 17: సిక్కు మత సంప్రదాయాలను ఉల్లంఘిస్తూ కొంత మంది సిక్కులు బీచ్‌లు, రిసార్టులలో డెస్టినేషన్ వివాహాలు చేసుకుంటున్నారని, వీటిపై నిషేధం విధిస్తున్నట్టు అకాల్ తఖ్త్ సోమవారం పేర్కొన్నది. ఈ ప్రదేశాల్లో కొందరు సిక్కుల పవిత్ర గ్రంథమైన గురు గ్రంథ్ సాహిబ్‌లను ఏర్పాటు చేసి వివాహాలు నిర్వహిస్తున్నారని, అలాంటి ప్రదేశాల్లో వాటిని ఏర్పాటు చేయడంపై నిషేధం విధిస్తున్నట్టు పేర్కొంది. అకాల్ తఖ్త్ చీఫ్ జ్ఞాని రఘబీర్ సింగ్ నేతృత్వంలో సమావేశమైన ఐదుగురు మతపెద్దల కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది.

## రాష్ట్రపతి పదవి వద్దన్న వాజ్‌పేయి!

న్యూఢిల్లీ: రాష్ట్రపతి పదవిని చేపట్టాలని అత్యంత సన్నిహితులు ఇచ్చిన సలహాను మాజీ ప్రధాన మంత్రి, దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి తిరస్కరించారని ఆయన వద్ద మీడియా సలహాదారుగా పని చేసిన అశోక్ టాండన్ తెలిపారు. టాండన్ రాసిన పుస్తకం 'ది రివర్స్ స్వింగ్ కలోనియలిజం టు కోఆపరేషన్'లో ఈ వివరాలను వెల్లడించారు. 1998-2004 మధ్య కాలంలో వాజ్‌పేయి ప్రధాన మంత్రిగా ఉన్నపుడు, 2002లో రాష్ట్రపతి ఎన్నికలు వచ్చాయని, అద్వానీకి ప్రధాని పదవిని ఇచ్చేసి, రాష్ట్రపతి పదవికి ఎన్డీయే అభ్యర్థిగా నామినేషన్ వేయాలని వాజ్‌పేయి సన్నిహితులు ఆయనకు సలహా ఇచ్చారని తెలిపారు. ఎలక్టోరల్ కాలేజీలో మెజారిటీతో ప్రస్తుత ప్రధాన మంత్రి రాష్ట్రపతి కావడం ప్రజాస్వామిక దేశానికి శుభసూచకం కాదని చెప్పారని తెలిపారు. అబ్దుల్ కలాంను రాష్ట్రపతి అభ్యర్థిగా సిఫారసు చేసిన వారు వాజ్‌పేయి అని చెప్పారు.

## మొయిత్రాపై ఆరోపణలు ఎథిక్స్ కమిటీకి

న్యూఢిల్లీ : తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రాపై బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే చేసిన ఆరోపణలను ఎథిక్స్ కమిటీకి పంపుతున్నట్టు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మంగళవారం ప్రకటించారు. బీజేపీ ఎంపీ వినోద్ కుమార్ సోన్‌కర్ ఈ కమిటీకి చైర్మన్‌గా ఉన్నారు. పార్లమెంట్‌లో ప్రశ్నలు అడగటానికి ఎంపీ మొయిత్రా ఒక వ్యాపారి వద్ద నుంచి లంచం తీసుకున్నారని, ఆమెపై వచ్చిన ఆరోపణలపై విచారణ కమిటీని వేయాలంటూ స్పీకర్‌కు దూబే విజ్ఞప్తి చేశారు.

# స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించలేం

- ఆ పని కోర్టులది కాదు.. పార్లమెంటుదే
- ఈ అంశంలో మేం జోక్యం చేసుకోలేం
- స్వలింగ సంపర్కులకు దత్తత హక్కు లేదు
- సుప్రీంకోర్టు సంచలన తీర్పు
- స్వలింగ సంస్కృతి అర్బన్‌కే పరిమితం కాదన్న న్యాయస్థానం
- స్వలింగ సంపర్కుల హక్కులను కాపాడాలని ప్రభుత్వాలకు సూచన



న్యూఢిల్లీ, అక్టోబర్ 17: స్వలింగ సంపర్కుల వివాహాలకు చట్టబద్ధత కల్పించే అధికారం కోర్టులకు లేదని సుప్రీంకోర్టు ప్రకటించింది. స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ ప్రకారం స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాలా? వద్దా? అనేది నిర్ణయించాల్సింది పార్లమెంటు మాత్రమేనని తేల్చిచెప్పింది. దేశమంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'స్వలింగ వివాహాల చట్టబద్ధత'పై ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ ఎస్ రవీంద్ర భట్, జస్టిస్ హిమాకోహ్లీ, జస్టిస్ పీఎస్ నరసింహ సభ్యులుగా ఉన్న ఈ ధర్మాసనం మొత్తం నాలుగు అంశాలపై తీర్పులను ప్రకటించింది. పలు అంశాలపై సీజేఐ చంద్రచూడ్, జస్టిస్ కౌల్‌తో జస్టిస్ భట్, జస్టిస్ హిమాకోహ్లీ, జస్టిస్ నరసింహ విభేదించారు. భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేసినప్పటికీ అంతిమంగా ఈ వివాహాలకు చట్టబద్ధతను పార్లమెంటు మాత్రమే తేల్చాలని స్పష్టంచేశారు.

**చట్టాలు మార్చటం కుదరదు**

స్వలింగ సంపర్కులు (ఎల్జీబీటీక్యూఏప్లస్ ప్లస్) సహజీవనం చేయటం నేరం కాదంటూ 2018లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ తర్వాత స్వలింగ సంపర్కుల వివాహాలకు చట్టబద్ధత కల్పించేలా స్పెషల్ మ్యారేజ్ యాక్ట్, ఫారిన్ మ్యారేజ్ యాక్ట్‌లో మార్పులు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో 18 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై సుదీర్ఘ వాదనల తర్వాత తీర్పు వెలువడింది. ఎల్జీబీటీల కోసం చట్టాలను మార్చటం కుదరదని ధర్మాసనం తేల్చిచెప్పింది.

**దత్తతపై కుదరని ఏకాభిప్రాయం**

స్వలింగ సంపర్క జంటలకు పిల్లలను దత్తత తీసుకునే హక్కు లేదని కోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు 3:2 మెజార్టీతో తీర్పు వెలువరించింది. జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ కౌల్ దత్తతకు మద్దతుగా తీర్పునివ్వగా, జస్టిస్ రవింద్ర భట్, జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ నరసింహ వ్యతిరేకంగా తీర్పు వెలువరించారు.

**పెండ్లి ప్రాథమిక హక్కు కాదు**

సుప్రీంకోర్టు చట్టాలు చేయదని, పార్లమెంటు చేసిన చట్టాలను అవసరమైతే పరిశీలిస్తుందని సీజేఐ చంద్రచూడ్ అన్నారు. స్వలింగ సంపర్కులపై ఏరకంగానైనా వివక్ష ఉంటే.. వాటిని అధ్యయనం చేసి పరిష్కరించేందుకు కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి నేతృత్వంలో కమిటీ వేస్తామని కేంద్రప్రభుత్వం తన అఫిడవిట్‌లో తెలిపిందని, దానిని రికార్డుల్లోకి తీసుకొంటున్నామని చెప్పారు. పెండ్లి చేసుకోవటం అనేది ప్రజలకు రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కు కాదని సీజేఐతోపాటు జస్టిస్ కౌల్, జస్టిస్ భట్ ప్రకటించారు. అయితే, స్వేచ్ఛ, జీవించే హక్కు కల్పిస్తున్న ఆర్టికల్ 21లో వివాహం చేసుకొనే హక్కు కూడా అంతర్లీనంగా ఉన్నదని తెలిపారు. స్వలింగ సంపర్కులపై వివక్షలను రూపుమాపేలా కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ధర్మాసనం సూచించింది.

**అవగాహన వచ్చాకే లింగమార్పిడి**

లింగమార్పిడిపై కూడా ధర్మాసనం పలు సూచనలు చేసింది. 'లింగ మార్పిడి చేయించుకోవాలనుకొనే బాల, బాలికలకు.. ఈ అంశంపై పూర్తిగా అవగాహన ఉన్నదో లేదో ముందుగా పరిశీలించాలి. పూర్తి అవగాహనతో ఉన్నవారికి మాత్రమే లింగమార్పిడికి అవకాశం ఇవ్వాలి. విచిత్ర (ఎల్జీబీటీక్యూఐఏప్లస్ ప్లస్) జంటలపై ఏవైనా చర్యలు తీసుకోవాల్సి వస్తే ముందుగా వారి బంధంపై ప్రాథమిక విచారణ చేసిన తర్వాతే పోలీసులు తదుపరి చర్యలు చేపట్టాలి' అని ధర్మాసనం తెలిపింది.

**పట్టణాలకే పరిమితం కాదు**

స్వలింగ సంపర్క సంస్కృతి పట్టణాలు, ఉన్నత వర్గాల్లోనే ఉన్నదన్న వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. ఈ విధానం అర్బన్, ఎలైట్ వర్గాలకే పరిమితం కాదని, ప్రపంచంలో అన్నిచోట్లా ఉన్నదని స్పష్టంచేసింది. స్వలింగ సంపర్కులు, భిన్న లింగ సంపర్కులు ఒకే నాణేనికి ఉన్న రెండు ముఖాల వంటివారని, స్వలింగ సంపర్క వివాహాలకు కూడా చట్టబద్ధత కల్పిస్తే వివాహం విషయంలో సమానత్వం కల్పించినట్టు అవుతుందని జస్టిస్ కౌల్ అభిప్రాయపడ్డారు.



## ఒకే మొక్కకు మూడు రకాల కూరగాయలు

వారణాసి: కూరగాయల ధరలు ఆకాశాన్ని తాకుతున్న వేళ ఉత్తరప్రదేశ్‌లోని భారత వ్యవసాయ పరిశోధన మండలి-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వెజిటబుల్ రిసెర్చ్ (ఐసీఏఆర్-ఐఐవీఆర్) పరిశోధకులు శుభవార్త చెప్పారు. ఏక కాలంలో వంకాయలు, టమాటాలు, మిరపకాయలు పండే మొక్కను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీనికి ఇంకా పేరు పెట్టలేదన్నారు. గతంలో ఆలు, టమాటాలు పండే ఓ మొక్కను ఈ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. దీనికి పొమాటో అని పేరుపెట్టారు.

## మహారాష్ట్ర స్పీకర్‌కు సుప్రీం అల్టిమేటం

న్యూఢిల్లీ: మహారాష్ట్ర శాసనసభ స్పీకర్ రాహుల్ నార్వేకర్‌కు సర్వోన్నత న్యాయస్థానం అల్టిమేటం జారీచేసింది. శివసేనలోని ఉద్ధవ్, షిండే వర్గాలు పరస్పరం తమ ప్రత్యర్థి వర్గ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని దాఖలు చేసిన పిటిషన్లపై ఎప్పటిలోగా తేల్చుతారో స్పష్టం చేయాలని ఆదేశించింది. స్పీకర్‌కు ఇదే చివరి అవకాశమని స్పష్టంచేసింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ప్రభుత్వం తరపున మాట్లాడుతూ, తాను వ్యక్తిగతంగా స్పీకర్‌తో మాట్లాడతానని, నిబంధనలను తెలియజేస్తానని చెప్పారు.

## యూజీసీ వాట్సాప్ చానల్ ప్రారంభం

న్యూఢిల్లీ, అక్టోబర్ 17: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) వాట్సాప్ చానల్‌ను ప్రారంభించింది. ఉన్నత విద్యకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు విద్యార్థులకు అందుబాటులో ఉంచడానికి ఈ చర్యలు చేపట్టింది. ఈ చానల్ వల్ల కీలక సమాచారాన్ని, పెరుగుతున్న అవకాశాలను ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలు ఉంటుంది. యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ జగదీశ్ కుమార్ మాట్లాడుతూ వాట్సాప్ చానల్‌ను ప్రారంభించడం ఉన్నత విద్యా రంగంలో ఓ కీలక అడుగని చెప్పారు.

## బాబు క్వాష్‌పై తీర్పు వాయిదా

హైదరాబాద్, అక్టోబర్ 17(నమస్తే తెలంగాణ): ఏపీలో స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో తన అరెస్టు, రిమాండ్‌ను సవాల్ చేస్తూ టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో వాదనలు ముగిశాయి. గత విచారణకు కొనసాగింపుగా సీఐడీ తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ మంగళవారం కూడా వాదనలు వినిపించారు. ఇరువర్గాల వాదనలు విన్న అనంతరం ధర్మాసనం తీర్పును వాయిదా వేసింది. ఈలోగా బాబుకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు మాత్రం నిరాకరించింది. ఈ కేసులో చంద్రబాబుకు సెక్షన్ 17ఏ వర్తిస్తుందా లేదా అన్న దానిపై ముకుల్ రోహత్గీ, హరీశ్ సాల్వే వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన పలు తీర్పుల్ని, ఐపీసీ, సీఆర్పీసీలను ఉదహరించారు. అనంతరం ధర్మాసనం తీర్పును రిజర్వు చేస్తున్నట్టు ప్రకటించింది.

## నా బిడ్డ మరణానికి శివరామే కారణం

▸ III తరువాయి...

నా హాస్టల్‌కు ఐదు నిమిషాల దూరం ఉంటుంది. మా అక్కను తరుచూ కలుస్తుంటా. మా అక్క చనిపోవడానికి శివరామ్ అనే వ్యక్తే కారణం. వేరే అమ్మాయి ద్వారా మా అక్కకు పరిచయం అయ్యాడు. అప్పటి నుంచి మా అక్కకు ఇష్టం లేకపోయినా మాట్లాడటం, ఫోన్ చేయటం, హాస్టల్‌కు వచ్చి అందరిముందు ఇబ్బంది పెట్టాడు. ఎవరితో చెప్పుకోవాలో తెలియక, మా అమ్మ, నాన్న, నాకు చెప్తే ఏమనుకుంటారో అని డిప్రెషన్‌కు వెళ్లి సూసైడ్ చేసుకున్నది. మా అక్క మరణానికి కారణం అయిన శివరామ్‌ను ఎక్కడున్న పట్టుకొచ్చి ఉరితీయాలి. ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి. ఈ ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణమని చెప్పాలని కాంగ్రెస్ వాళ్లు మా దగ్గరకు వస్తున్నారు. దయచేసి మా దగ్గరకు రాకండి. ఈ అంశంపై రాజకీయం చేయకండి' అని ప్రాధేయపడ్డాడు. అటు.. ప్రవళిక ఆత్మహత్య ఘటనను సీరియస్‌గా తీసుకొన్న పోలీసులు.. కేసులో మరికొన్ని సెక్షన్లను జోడించారు. ముందుగా అనుమానాస్పద స్థితి మృతిగా నమోదుకాగా, 174 ఐపీసీ సెక్షన్లను మార్చి, 417, 420, 306 ఐపీసీ సెక్షన్లు జోడించారు. మోసం, ప్రవళిక ఆత్మహత్యకు కారణం(అబెట్‌మెంట్ టు సూసైడ్) కింద ఈ కొత్త సెక్షన్లను జోడించారు. పరారీలో ఉన్న శివరామ్ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి గాలింపు చేపట్టారు.



ప్రవళిక సోదరుడు కుమార్


## నేటి నుంచి బస్సెక్కితే బహుమతులు

- 30 వరకు లక్కీడ్రాలో పాల్గొనే అవకాశం

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ప్రయాణికుల కోసం టీఎస్‌ఆర్టీసీ ప్రకటించిన లక్కీడ్రా బుధవారం నుంచి ప్రారంభం కానున్నది. ఈ నెల 30 వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన వారికి నగదు బహుమతులు గెలుచుకునే అవకాశం కల్పించింది. ఈ లక్కీ డ్రాలో గెలుపొందిన ప్రయాణికులకు రూ.11 లక్షల నగదు బహుమతులను సంస్థ అందిస్తుందని అధికారులు వెల్లడించారు. ప్రయాణికులు టికెట్ వెనుక తమ పేరు, ఫోన్ నంబర్‌ను రాసి, బస్టాండ్లలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్సుల్లో వేయాలని ప్రయాణికులకు సూచించారు.

## మొబైల్ ఫోన్ వాడకంతో పిల్లల్లో ఒత్తిడి, ఆందోళన

- లోకల్ సర్కిల్స్ సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: గంటలకొద్దీ మొబైల్ ఫోన్లకు అతుక్కుపోతున్న పిల్లల్లో మానసిక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. ఆందోళన, ఒత్తిడితో సతమతమవుతూ వైద్యుల్ని సంప్రదిస్తున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతున్నదని, ఆన్‌లైన్ గేమింగ్, సోషల్‌మీడియాకు పిల్లలు బానిసలుగా మారటమే ఇందుకు కారణమని వారు తేల్చారు. తమ పిల్లలు తీవ్ర ఆందోళన, ఒత్తిడికి లోనవుతున్నారని ప్రతి ముగ్గురు తల్లిదండ్రుల్లో ఒకరు చెప్పినట్టు 'లోకల్ సర్కిల్స్' సర్వే పేర్కొన్నది. గంటలకొద్దీ సోషల్‌మీడియాతో గడపటం వల్ల పిల్లల్లో మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని సర్వే తెలిపింది. 'ప్రతి 10 మంది పిల్లల్లో ఆరుగురు రోజూ సగటున 3 గంటలకుపైగా గేమింగ్ సైట్స్, సోషల్ మీడియాతో గడుపుతున్నారని ఓ జాతీయ సర్వే తేల్చింది' అని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ హర్దీప్ సింగ్ చెప్పారు. అక్టోబర్ 10 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం' సందర్భంగా ఈ సర్వే వివరాల్ని విడుదల చేసింది.